18వ వసంతంలోకి..
నేటి దినపత్రిక
# సూర్య
## ఎన్టీఆర్ - కృష్ణా
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 పేజీలు 8

### చారిత్రాత్మక ప్రదేశాలలో
# స్వచ్ఛత హి సేవ

**స్వచ్ఛ్ విజయవాడ ప్రజల సహకారం, భాగస్వామ్యంతో సాధ్యం**

7

**నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పేరు ప్రఖ్యాతులు పెరగాలంటే చారిత్రాత్మిక ప్రదేశాలలో స్వచ్ఛత ఎంతో ముఖ్యమైనదని స్వచ్ఛత హి సేవ నిజమైన అర్థం అని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు.

### మానవ అక్రమ రవాణా నిరోధానికి..
# పటిష్ట చర్యలు




**ఎన్జీవోలు, సామాజిక సంస్థలు అరికట్టేందుకు భాగస్వాములవ్వాలి**

**హోం మంత్రి వంగలపూడి అనిత,**
**మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి**

**విజయవాడ బ్యూరో, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** మానవ అక్రమ రవా ణాను అరికట్టడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని, ఈ సంప్రదింపులు మా సంకల్పానికి బలం చేకూర్చాయని, ఈ వ్యూహాలను అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మానవ అక్రమ రవాణా కేవలం మానవ హక్కుల ఉల్లం ఘన కాదు, ఇది జీవి తాలను, సమాజాలను నాశనం చేసే నేరం అని అన్నారు. గురువారం నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన నేషనల్ కన్సల్టేషన్ ఆన్ కౌంటరింగ్ సైబర్ – ఎనేబుల్డ్ ట్రాఫికింగ్ పై ఏర్పాటు చేసిన వర్క్ షాపులో ఆమె మాట్లాడుతూ నా సహచర మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర డీజీపీ సీహెచ్. ద్వారకా తిరుమల రావు, ఐటీ సెక్రటరీ సౌరభ్ గౌర్, 27 రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులు,

2

### దీపావళికి
# ఉచిత గ్యాస్ సిలిండర్లు

**మాజీ మంత్రి దేవినేని ఉమ**



2లో..



# ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ళ

- నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన నేతలు
- ఆర్టీసీని లాభాల బాటలో నడిపిస్తారనే పూర్తి నమ్మకం ఉంది
- మంత్రి కొల్లు రవీంద్ర

2లో

### సమస్యలను వెంటనే
# పరిష్కరించండి

**జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే కుమార్ రాజా వినతి**



**పామర్రు సెప్టెంబర్ 26 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా గురువారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలిసి విన్నవించారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం కొంతమేర అందిందని, మిగిలిన

మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## సమస్యలను వెంటనే పరిష్కరించండి

వారికి కూడా త్వరితగతిన అందించాలని కోరారు. అలాగే వర్షాల కారణంగా గ్రామాల్లో రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, వాటికి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ముంపుకు గురైన సమయంలో పొలాల్లోని నీరు డ్రైన్ లో లోనికి వెళ్లడం లేదని, అందువలన రైతులు పూర్తిగా నష్టపోతున్నారని కావున వెంటనే డ్రై న్ ల మరమ్మతులు కూడా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కు ఎమ్మెల్యే కుమార్ రాజా వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు తెలుగుదేశం నాయకులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, లింగమనేని రామలింగేశ్వర రావు, వల్లూరుపల్లి గణేష్ కుమార్, కొసరాజు ప్రకాష్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ళ



### నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన నేతలు

### ఆర్టీసీని లాభాల బాటలో నడిపిస్తారనే పూర్తి నమ్మకం ఉంది

### మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** కొనకళ్ళ నారాయణరావు పార్లమెంటు సభ్యులుగా రెండు పర్యాయాలు పనిచేసి రాష్ట్రానికి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకొచ్చారని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఆబ్కారి శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం కొనకళ్ళ నారాయణరావును ఆర్టీసీ చైర్మన్గా నియమించిన నేపథ్యంలో గురువారం ఉదయం మంత్రి నగరంలోని కొనకళ్ళ నారాయణరావు స్వగృహానికి వెళ్లి శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కొనకళ్ళ నారాయణరావును ఆర్టీసీ చైర్మన్ గా ప్రభుత్వం నియమించడం పట్ల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. నారాయణ రావు నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులుగా పనిచేశారని ఆర్టీసీ గురించి వారికి అన్ని విధాల పూర్తిగా అవగాహన ఉందని, నష్టాల్లో ఉన్న ఆర్టీసీని వారు లాభాల బాటలో నడిపిస్తారనే పూర్తి నమ్మకం ఉందన్నారు. ఎంతో పవిత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుమల లడ్డు తయారీకి వాడే నెయ్యిలో కల్తీ చేశారని, దీనిపై విచారణ జరుగుతోందని బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల భారీ వర్షాలు బుడమేరు వరదల కారణంగా అతలాకుతలమైన విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 11 రోజులపాటు ప్రజలకు అండగా నిలిచి సాధారణ స్థితికి వచ్చేంతవరకు అక్కడే ఉన్నారన్నారు. నీటి వనరులను ఎవరు కూడా ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. మచిలీపట్నంలోని 26 ఎకరాల మడుగు పోరంబోకు, స్మశాన భూములు, నీటి సంబంధమైన ప్రాంతాలను కబ్జా చేసి ఇల్లు కట్టుకోవద్దని పట్టాలు రావని తాము ఇదివరకే చెప్పామన్నారు. అక్కడి వారందరికీ ఎన్నికల్లో చెప్పిన విధంగా ఇంటి నివేశన స్థలాలు కేటాయించి నాలుగు లక్షల రూపాయలతో ఇల్లు కట్టుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపేందుకు తన వంతు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్, డిపో లో నీరు నిలబడకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవలసిన గురుతర బాధ్యత తనపై ఉందన్నారు. మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు నారాయణరావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు



నందిగామ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ : గని ఆత్కూరు గ్రామంలో నరసయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తెలు గుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్థానిక నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్కూరుని తెలుగుదేశం పార్టీకి కంచుకోట చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. పార్టీ ఆవిర్భావం నుండి సొసైటీ అధ్యక్షులుగా సర్పంచ్గా పనిచేస్తూ ఎన్ని కష్టాలు ఉన్న ఆర్థిక ఇబ్బందులు వచ్చిన పార్టీ కోసం ప్రాణం పెట్టారు. 164 సీట్లతో అత్యధిక మెజారిటీతో కూటమి కి ప్రజలు మద్దతు పలికారు. చంద్రబాబు నాయకత్వంలో మన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం జరగాలి, పోలవరం ప్రాజెక్టు పూర్తి అవ్వాలి, మన ప్రాంతం గ్రామాలు బాగుపడాలని ప్రజలందరూ ఏకతాటిపై కొచ్చి కూటమికి మద్దతు కలిపారు. చంద్రబాబు అనుభవం రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతుంది. ప్రతినెల 1వ తేదీ పేదవాడి దగ్గరికి 4 వేల పెన్షన్ వెళుతుంది. దీపావళికి మాటిచ్చిన ప్రకారం గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఉచితంగా ఇవ్వబోతున్నాం. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలు అన్ని అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుంది. వరదల్లో ఇంటిని వదిలేసి కలెక్టర్ కార్యాలయంలో బస్సులో ఉండి సమీక్షించి ప్రతి ఏరియా తిరుగుతూ 15 రోజుల్లో నష్టపరిహారం 602 కోట్లు గ్రామాల్లోకి పంపించిన ఘనత నారా చంద్రబాబు నాయుడుది అన్నారు. చింతలపూడి గోదావరి నీళ్లు రాబోయే రోజుల్లో నాగార్జునసాగర్ కాలువల్లో పడి కీసర బ్రిడ్జి వద్ద గోదావరి తల్లి కృష్ణమ్మల్లో కలుస్తుందని, నాగార్జునసాగర్ కాలువల్లోకి గోదావరి నీళ్లు వస్తే వీరులపాడు కంచికచర్ల మండలం సస్య శ్యామల మవుతాయి అన్నారు.

# మానవ అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు




(మొదటిపేజీ తరువాయి)

పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జ్యుడీషియల్ అకాడమీ డెరెక్టర్లు, మహిళా, శిశు సంక్షేమ శాఖల అధికారులు, ఎన్జీవో ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్నానన్నారు. పద్మశ్రీ సునీత కృష్ణన్‌తో ఈ ప్లాట్‌ఫారమ్‌ను పంచుకోవడం నాకు గర్వంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేసే ఆధునిక బానిసత్వం అయిన మానవ అక్రమ రవాణా లాంటి క్లిష్టమైన సమస్యను వెలుగులోకి తీసుకు వచ్చినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. సైబర్ హ్యూమన్ ట్రాఫికింగ్ ను అరికట్టేందుకు ఎన్జీవోలు, సామాజిక సంస్థలు భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి సైబర్ నేరాలను అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ, ట్రాఫికర్లు ఉపయోగించే పద్ధతులు కూడా అంతుచిక్కకుండా ఉంటున్నాయన్నారు. దేశవ్యాప్తంగా నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన డేటా ప్రకారం, 2021 నుండి పిల్లల అక్రమ రవాణాకు సంబంధించి నేరాలలో 32 శాతం పెరుగుదలను ప్రతిబింబిస్తున్నాయన్నారు. ప్రజ్వల సంస్థ తయారు చేసిన సైబర్-ఎనేబుల్డ్ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై నేషనల్ యాక్షన్ రీసెర్చ్ రిపోర్ట్‌ను మంత్రులు డీజీపీతో కలిసి విడుదల చేశారు. తొలుత మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి కలసి రెండు రోజుల నిర్వహించే ఈ సదస్సును జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కమ్యూనిటీ సమూహాలు, స్వచ్ఛంద సేవకులు బాధితులకు సహాయం చేయడానికి, వారి హక్కుల కోసం వాదించడానికి, దోపిడీని నిరోధించడానికి ముందు వరుసలో పనిచేస్తున్నారన్నారు. ఈ ముప్పును ఎదుర్కోవడానికి మరొక రక్షణ యంత్రాంగం చట్టాలు, విధానాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ట్రాఫికర్లు లొసుగులను ఉపయోగించుకుంటారు, ట్రా ఫికర్లు దోపిడీ చేసే డిజిటల్ ఆవిష్కరణలకు అనుగుణంగా చట్టాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. భారతదేశంలో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, సుప్రీం కోర్ట్ యొక్క వివిధ మార్గదర్శకాలు సైబర్ మానిటరింగ్ సెల్‌లను ఏర్పాటు చేయడానికి చట్ట అమలును ఎనేబుల్ చేసినప్పటికీ, ఇంకా చాలా చేయవలసిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సైబర్ పర్యవేక్షణ, పరిశోధనల కోసం చట్ట బద్ధమైన నిబంధనలను అందించాల్సిన అవసరం ఉందన్నారు.

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి మాట్లాడుతూ ఈ రోజు ఇక్కడ కనిపిస్తున్న సమిష్టి కృషి, పెరుగుతున్న నేరాన్ని పరిష్కరించడానికి మాకు ఒక మార్గాన్ని అందించిందన్నారు.. మన సమాజంలో టాఫికింగ్ బాధితులను రక్షించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడిందన్నారు. సైబర్ స్పేస్ అనేది భౌగోళిక పరిదులు లేనిదని, సైబర్ నేరాలను నియంత్రించడానికి అన్ని స్థాయిల్లోనూ వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సైబర్ నేరాలు అనేది చాలా త్వరితగతిన వ్యాపిస్తున్న అంతర్జాతీయ నేరాల యొక్క రూపాల్లో ఒకటన్నారు. వేగంగా పెరుగుతున్న ఇంటర్నెట్ వినియోగం త్వరితగతిన మారుతున్న సాంకేతికత వలన, సైబర్ ఆధారిత మానవ అక్రమ రవాణాలో వివిధ రూపాలు సంతరించు కుంటుందని మంత్రి తెలిపారు. ట్రాఫికర్ల ద్వారా బాధితుల నియామకంపై సాంకేతికత వివిధ మార్గాల్లో ప్రభావం చూపిందన్నారు. బాధితుల స్నేహితులు, కుటుంబం, పని వివరాలు, సెలవులు, అభిరుచులు, అలవాట్లు వాటి వివరాలు ముఖ్యంగా ఫేస్ బుక్, టిక్ టాక్, స్నాప్ చాట్, ఇన్ స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ లలో ట్రాఫికార్స్ ఇంటర్నెట్ ను ఉపయోగించి కనుగొంటున్నారన్నారు. రాష్ట్ర డీజీపీ సీహెచ్. ద్వారకా తిరుమల రావు మాట్లాడుతూ నేషనల్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రిపేర్ చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అది చాలా కష్టతరమని అయినా చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.. మానవ అక్రమ రవాణా ఈనాడు వచ్చింది కాదు ప్రాచీన కాలం నుంచి ఉందన్నారు. మానవ అక్రమ రవాణా అనేది అనేక రూపాలల్లో నేడు సమాజంలో కనిపిస్తుందన్నారు. నూతన సాంకేతికతను ఉపయోగించుకుని మానవ అక్రమ రవాణా నిరోధించడానికి రాష్ట్ర సీఐడీ సంస్థ ప్రముఖంగా పనిచేస్తుందన్నారు. పోలీసు శాఖ కూడా అనేక విధాలుగా దీన్ని నిరోధించడానికి అవిరళ కృషి చేస్తుందన్నారు.

ప్రజ్వల వ్యవస్థాపకురాలు డాక్టర్ సునీత కృష్ణన్ ఈ ఈవెంట్ యొక్క ప్రాముఖ్యతపై తన ఆలోచనలను పంచుకున్నారు. ఈ కొత్త యుగంలో మానవ అక్రమ రవాణా అనే నేరం అంటువ్యాధి లా వ్యాప్తి చెందుతుందని, దీన్ని అరికట్టి, తక్షణ చర్యలు తీసుకోవడానికి సమయం ఆసన్నమైందని, పౌర సమాజం కూడా చేతులు కలపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్, ఐటి సెక్రటరీ సౌరవ్ గౌర్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ. సూర్య కుమారి, 27 రాష్ట్రాలు నుండి వచ్చిన సీనియర్ పోలీస్ ఆఫీసర్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, డౌరెక్టర్స్ ఆఫ్ జ్యుడీషియల్ అకాడమీస్, మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారులు, పౌర సమాజ సంస్థల ప్రతినిధులు, తదితరలు పాల్గొన్నారు.



# 28, 29 తేదీలలో శ్రీరామ్ ఫైనాన్స్ టూ-వీలర్ ఎక్స్ఛేంజ్, లోన్ మేళా







**విజయవాడ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ గ్రూప్ యొక్క ఫ్లాగ్‌షిప్ కంపెనీ, సెప్టెంబర్ 28, 29తేదీలలో విజయవాడలోని పివిపి స్క్వేర్‌లో ఆన్-గ్రౌండ్ టూ-వీలర్ ఎక్స్ఛేంజ్, లోన్ మేళాను నిర్వహించింది. హీరో, సుజుకి, టీవీఎస్, యమహా, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి ఏఈఎంలు ఈ ఎక్స్ఛేంజ్, లోన్ మేళా కోసం శ్రీరామ్ ఫైనాన్స్‌తో భాగస్వామ్యం చేసుకున్నాయి. ద్విచక్ర వాహన రుణాలను వినియోగదారులకు సౌకర్యవం తంగా, సమర్ధ వంతంగా సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి, ఈ పండుగ సీజన్ లో వారి కలల ద్విచక్ర వాహన కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ మేళా నిర్వహించబడింది. శ్రీరామ్ ఫైనాన్స్ నుండి టూ-వీలర్ లోన్ ఎలిజిబిలిటీ వోచర్, ఇది రుణ ఆమోద ప్రక్రియను వేగవంతం చేస్తుంది, అర్హత ఉన్న లోన్ మొత్తానికి శీఘ్ర ప్రాప్యతను అందిస్తుంది, విజయవాడ, పరిసర ప్రాంతాల నివాసితులకు లోన్ మేళాలో అందుబాటులో ఉంటుంది. వినియోగదారులు www.shriramfinance.in లేదా శ్రీరామ్ వన్ యాప్‌లో ప్రాథమిక సమాచారాన్ని అందించడం ద్వారా కస్టమర్‌లు పూర్తి లోన్ బ్రేక్‌డౌన్‌తో కూడిన వోచర్‌ను అందుకుంటారు. వారు తదుపరి లోన్ ప్రాసెసింగ్ కోసం లోన్ మేళాలో శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధికి సమర్పించగలరు. లోన్ ఆమోదానికి కేవలం 10 నిమిషాల సమయం పడుతుంది, అయితే నిధులు 24 గంటల్లో పంపిణీ చేయబడతాయి. కార్యక్రమం గురించి మాట్లాడుతూ, ఎలిజబెత్ వెంకట రామన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ – మార్కెటింగ్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఇలా అన్నారు, "పండుగ సీజన్ కొత్త వాహనాల కొనుగోలుకు, షాపింగ్‌కు అనుకూలమైన సమయం. శ్రీరామ్ ఫైనాన్స్ వాహనాల ఎక్స్ఛేంజ్, లోన్ మేళాను నిర్వహిస్తోంది, ఇది కస్టమర్‌లు కొత్త ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసే అవకాశాన్ని అందిస్తోంది లేదా ఇప్పటికే ఉన్న వాటిని మార్చుకునే అవకాశాన్ని అందిస్తోంది. ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి, లోన్ మేళా కస్టమర్‌లకు లోన్ అర్హత వోచర్‌కు యాక్సెస్‌ను అందిస్తుంది, తక్షణమే వారి రుణ అర్హతను చూపుతుంది. ఇది సజావుగా, వేగవంతమైన ప్రక్రియకు హామీ ఇస్తుంది, విజయవాడలోని కుటుంబాలు ఇంటికి కొత్త ద్విచక్ర వాహనాన్ని స్వాగతించడానికి, ఈ ఆనందకరమైన సందర్భాన్ని ఆస్వాదించడానికి ప్రక్రియను సులభతరం చేస్తుంది.

# సరిగమప సీజన్ 16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ గ్రాండ్ లాంచ్

**ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, మీ జీ తెలుగులో!**




**అమరావతి, సెప్టెంబర్ 25, మేజర్ న్యూస్ :** జీ తెలుగు ఆవిర్భావం నుంచి విలక్షణమైన ఫిక్షన్, నాన్ ఫిక్షన్ షోలు, సూపర్ హిట్ సినిమాలతో ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. వినోదాల పరంపరను కొనసాగిస్తూ జీ తెలుగు పాపులర్ షో సరిగమప సరికొత్త సీజన్తో వచ్చేస్తోంది. మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తూ అత్యంత ప్రేక్షకాదరణతో విజయవంతంగా 15 సీజన్లు పూర్తిచేసుకున్న జీ తెలుగు సరిగమప తన తదుపరి సీజన్ను ఘనంగా ప్రారంభిస్తోంది. సరిగమప సీజన్ –16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ సెప్టెంబర్ 29న, సా.ఎం 6:00 ప్రారంభం, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు మీ జీ తెలుగులో మాత్రమే! తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయకులకు ప్రోత్సహించే లక్ష్యంతో డ్యాన్సింగ్, సింగింగ్ షోలతో మట్టిలో మాణిక్యాలను గుర్తిస్తోంది జీ తెలుగు. ఇందులో భాగంగానే విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చేసుకున్న సింగింగ్ షో 'స రి గ మ ప' కొత్త సీజన్ ప్రారంభం కానుంది. ఈ సీజన్లో గాయనీ గాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే మూడు జట్లుగా పోటీపడతారు. ఈ జట్లకు మెంటర్లుగా రేవంత్, రమ్య బెహరా, అనుదీప్ దేవ్ నాయకత్వం వహిస్తారు. ఈ సీజన్ కు ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా, సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ – అనురాధ గూడూరు మాట్లాడుతూ, "యువ, అసాధారణ ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ లాంచ్ ప్యాడ్ గా ఉన్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఈ సీజన్లో సింగింగ్ యూత్ ఐకాన్ కోసం పోటీ జరుగుతుంది. ప్రతి సీజన్ మాదిరిగానే ఈ సీజన్లోనూ ప్రతిభావంతులైన గాయనీ గాయకులను ప్రోత్సహించడమే మా లక్ష్యం. ఇప్పటికే మనం చూసిన ఎనర్జీ, ప్యాషన్, టాలెంట్ చెప్పుకోదగ్గవి. తమ కలలను నిజం చేసుకోవడమే కాకుండా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఓ వేదికను అందించడమే మా ఉద్దేశం. ఈ సీజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాం' అంటూ ధీమా వ్యక్తం చేశారు.

# వరద బాధిత రైతాంగానికి స్వల్ప కాలిక రుణాలను రి షెడ్యూల్ చేయాలి



**నందిగామ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న వ్యవసాయ పంటలకు.. రూ.280.92 కోట్ల పెట్టుబడి సాయాన్నిఅందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.17 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా 1.87 లక్షల మంది రైతులు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో 15 రోజులలో నష్టం పరిహారాన్ని అందించన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పంట పొలాల్లో వరదల కారణంగా పేరుకు పోయిన బురద ఇసుక మేటలను నూ తొలగించుటకు పంట భూములను యధాస్థితికి తీసుకొని రావడానికి రైతాంగానికి స్వల్ప కాలిక రుణాలను రీ షెడ్యూల్ చేసే విధంగా బ్యాంకర్ లకు ఆదేశాలు ఇవ్వాలి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ (చిన్ని) ని నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య,ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), పార్లమెంటు అధ్యక్షులు నెట్టెం రఘురాం ని కృషి చేయవలసిందిగా రైతుల తరఫున కోరుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి యంద్రపల్లి శ్రీనివాసరావు నందిగామ నియోజకవర్గ క్లస్టర్ 5 పంగా సతీష్ బాబు లు తెలిపారు.



# దేవర థియేటర్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్ సురేష్

**నందిగామ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్:** పట్టణంలో దేవర సినిమా రిలీజ్ అయిన థియేటర్ను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మొదటి రోజు శుక్రవారం రూ.1000లకు టిక్కెట్లు విక్రయిస్తున్నారని పలువురి ఆరోపణలు పై తాసిల్దార్ నూతక్కి సురేష్ బాబు ఆర్ఐ వేణికుమారి సిబ్బందితో తనిఖీ చేశారు. థియేటర్లో సినిమా టికెట్ల అమ్మకాలపై తనిఖీ చేశారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సినిమా టికెట్లు వెక్కిరిస్తే చర్యలు తప్పవని యాజమాన్యానికి హెచ్చరించారు.

# దేవినేని అవినాష్‌కు సత్కరించిన మొండితోక

**నందిగామ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైన దేవినేని అవినాష్ నందిగామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు ని మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం జగన్మోహన్ రావు, పార్టీ శ్రేణులు, జిల్లా నూతన అధ్యక్షులు దేవినేని అవినాష్ ని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నందిగామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సోనీ ఇండియా నుంచి ఎండీఆర్-ఎం1 క్లోజ్డ్ మానిటర్ స్టూడియో హెడ్‌ఫోన్లు



**విజయవాడ మేజర్ న్యూస్ :** సోనీ ఇం డియా ఎండీఆర్-ఎ1 రిఫరెన్స్ క్లోజ్డ్ మానిటర్ హెడ్‌ఫోన్‌లను విడుదల చేసింది. ఇది సంగీత సృష్టికర్తలు, ఆడియోఫిల్స్, సౌండ్ ఇంజనీర్‌ల కోసం రూపొందించబడింది. ఏ వాతావరణంలోనైనా తాము విన్న సంగీతాన్ని ఉత్పత్తి చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఈ హెడ్ ఫోన్‌లు అధిక సౌండ్ ఐసోలేషన్‌తో క్లోజ్డ్ అకౌస్టిక్ స్ట్రక్చర్‌ను కలిగి ఉంటాయి. ప్రత్యేకంగా అభివృద్ధి చేయబడిన డ్రైవర్, తేలికపాటి, సౌకర్యవంతమైన డిజైన్‌తో వినియోగదారులు స్టూడియోలో ఉన్నట్లుగా వారి స్వంత పరి సరాలను సృష్టించుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఎండీఆర్-ఎం1 హెడ్‌ఫోన్‌లు స్టూడియో సౌండ్ క్వాలిటీని అత్యంత సౌలభ్యం, విశ్వసనీయతతో మిళి తం చేస్తాయి. ప్రత్యేక ఆవిష్కరణ ఆఫర్‌గా, అక్టోబర్ 31 వరకు ఎండీఆర్-ఎం1 హెడ్‌ఫోన్‌లు రూ.17,990 తగ్గింపు ధరతో అందుబాటులో ఉన్నాయి.

## ఎస్ఐపీలపై వైట్‌ఓక్ క్యాపిటల్ ఏఎంసీ నివేదిక

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎస్ఐపీలను మార్కెట్ సైకిల్ ఎగువన ప్రారంభించడం లేదా దిగువన ప్రారంభించడంలలో ఏది మంచిది? అనే శీర్షికతో వైట్‌ఓక్ క్యాపిటల్ ఏఎంసీ మునుపటి ఎస్ఐపీ నివేదికను కొనసాగిస్తూ, కంపెనీ ఎస్ఐపీపై మరింత వివరంగా నివేదించింది. మార్కెట్ సైకిల్ దిగువన ప్రారంభమైన ఎస్ఐపీలకు రాబడి శాతం స్వల్పంగా ఎక్కువగా ఉన్నప్పటికీ, ఎగువన ప్రారంభమైన ఎస్ఐపీలకు రూపాయి టర్మ్ (వెల్త్ క్రియేషన్)లో సంపూర్ణ లాభం చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ఎస్ఐపీను ఆలస్యంగా ప్రారంభించడం వల్ల దీర్ఘకాలంలో కాస్ట్ ఆఫ్ డిలే భారీగా ఉంటుంది. మార్కెట్ దిగువ స్థాయికి చేరుకోవడానికి ఎంత ఎక్కువ సమయం పడుతుందో, మిగిలిన అన్ని విషయాలను స్థిరంగా ఉంచే కాస్ట్ ఆఫ్ డిలే" అంత ఎక్కువగా ఉంటుంది. మీరు ఎగువన ప్రారంభించారా లేదా దిగువన ప్రారంభించారా అనే దానితో సంబంధం లేకుండా రాబడి శాతం యొక్క స్వల్ప వ్యత్యాసం కూడా దీర్ఘకాలికంగా తొలగిపోతుంది. గత పనితీరు భవిష్యత్తులో నిలకడగా ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు. అలాగే భవిష్యత్తు రాబడులకు గ్యారంటీ కాదు. ఇండెక్స్ పనితీరు స్కీమ్ పనితీరును సూచించదు. అని సదరు నివేదిక వెల్లడించింది.

## పై జామ్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో అమెజాన్ ఎకో హ్యాకథాన్

**విజయవాడ మేజర్ న్యూస్ :** కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, పై జామ్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఎకో హ్యాకథాన్‌ను ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. ప్రధానమంత్రి 'లైఫ్' క్యాంపెయిన్‌తో సమలేఖనం చేయబడిన ఈ హ్యాకథాన్, సాంకేతికత, సృజనాత్మకత ద్వారా పర్యావరణ సమస్యలను పరిష్కరించే వారిగా విద్యార్థులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకతో సహా 14 రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానించబడ్డారు.

## ఎల్వీపీఈఐలో ఐఐహెచ్ వ్యాధిపై అవగాహన సదస్సు

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్‌టెన్షన్ ( ఐఐహెచ్) ను అర్థం చేసుకోవడానికి, అవగాహన కోసం నగరం లోని కోడె వెంకటాద్రి చౌదరి ప్రాంగణం దరి ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో వ్యాధి పై పూర్తి వివరాలతో గురువారం వెద్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎల్వీపీఈఐ వైద్యులు మాట్లాడుతూ ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్‌టెన్షన్ (ఐఐహెచ్) ముఖ్యంగా గర్భధారణ వయసు (20-50 సం.ల) ఉన్న స్త్రీలలో, ఊబకాయం, కంటి నరం సమస్యలు ఉన్న వ్యక్తులలో ఎక్కువ ప్రబలంగా ఉంటున్నదన్నారు. స్టెరాయిడ్లు, విటమిన్ ఎ సప్లిమెంట్లు, నోటిద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రలు, దీర్ఘకాలం పనిచేసే టెట్రాసైక్లిన్స్ (యాంటీబయాటిక్స్) అధిక ఉపయోగం, ఊబకాయ ప్రాబల్యం, వీటితో పాటు ఉండే రక్తహీనత పోలిసిస్టిక్ ఒవేరియన్ వ్యాధి – ఇవన్నీ ఐఐహెచ్ కేసుల సంఖ్య పెరుగుదలకు కారణమవుతున్నా యన్నారు. ఇది కళ్ళను, మెదడును ప్రభావితం చేస్తుందని, ఐఐహెచ్ తీవ్రమై న తలనొప్పులు చెదిరిన దృష్టి, ద్వంద్వ దృష్టి తాత్కాలిక దృష్టి అస్పష్టతలు (టివివోలు – కంటినరం రుగ్మతలు) టిన్నిటస్ (చెవులలో మోగుతున్నశబ్దం) లక్షణాలు ఉంటాయన్నారు. ఆఫ్థల్మాలజిస్టులు (నేత్ర నిపుణులు) రేడి యాలజిస్టులు, న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లతో సహకారం తో చికిత్స చేయవచ్చున్నారు. సకాలంలో రోగనిర్ధారణ, చికిత్సతో ఐఐహెచ్‌ను నిర్వహించవచ్చునని చెప్పారు.

## డీపీఆర్టీయూ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా యండ్రాతి మల్లేశ్వరరావు ఏకగ్రీవం



**వత్సవాయి, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** మండలంలో భీమవరం గ్రామం ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిపిఆర్టీయు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డా డి.శ్రీను ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిపిఆర్టీయు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో మన యూనియన్ ని ముందుకు తీసుకు వెళ్ళే విధంగా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా రాష్టం అంత యూనియన్ బలోపేతం చేసే విధంగా కమిటీ లు వేయడం జరుగుతుంది అని అన్నారు.ఈ కమిటీ ల నిర్మాణంలో ఉత్సాహంగా ఉండే ఉపాధ్యాయులు బాధ్యతలు నిర్వహిస్తే బాగుంటుంది అని అన్నారు.అనంతరం కమిటీలు వేయగా యం.పి.పి.పాఠశాల చినమోదుగుపల్లిలో పనిచేయుచున్న యండ్రాతి మల్లేశ్వరరావును రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏకగ్రీవం గా వెన్నుకోవడం జరిగింది. యం.పి.పి.యస్ భీమవరంలో పనిచేయున్న జక్కా రవీంద్రనాథ్ ను, జిల్లా సహాధ్యక్షుడు గాను, యం.పి.పి.యస్, మక్కపేటలో పనిచేయుచున్న షేక్ జాని ను, జిల్లా ఉపాధ్యక్షుడు గాను, యం.పి.పి.యస్, కన్నెవీడులో పనిచేయుచున్న రెమిడాల నాగేశ్వరరావు ను, జిల్లా కౌన్సిలర్ గాను, ఏకగ్రీవంగా, ఎన్నుకున్నట్లు, డిపిఆర్టీయు ఎన్టీఆర్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మర్రి ప్రభాకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి నాయకులు, ఆర్ రాంబాబు నాయక్, కాకాని వెంకట శ్రీనివాసరావు, ఆర్ భాను ప్రసాద్, అజ్మీరు శ్రీనివాసరావు, మోంగియా నాయక్, బెల్లంకొండ పూర్ణయ్య, సంగెపు కిరణ్ కుమార్, అజ్మీరు వెంకటప్పయ్య, బుజ్జి బాబు తదితరులు శుభాభినందనలు తెలియజేశారు.

## సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శిగా జె.వెంకట్రావు ఎన్నిక



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 26 మేజర్ న్యూస్ :** మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో సిపిఎం పార్టీ 3వ గ్రామ శాఖ కార్యదర్శిగా జజ్జువరపు వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో దంతాల వెంకటేశ్వర్లు ఇంటి వద్ద బుధవారం సిపిఎం పార్టీ గ్రామ శాఖ మహాసభ కాకనబోయిన లింగారావు అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముందు సిపిఎం పార్టీ జెండాను సిపిఎం పార్టీ మండల నాయకులు దంతాల రాజేశ్వరి ఆవిష్కరించారు. ఈ మహాసభలో 6 తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. గ్రామంలో కోతులు, కుక్కలు విపరీతంగా ఉన్నాయని వీటిని నివారించాలని, ఇటీవల వచ్చిన వరదల కారణంగా రైతు రుణాలను వడ్డీ మాఫీ, రైతు రుణాలను రీ షెడ్యూల్ చేయాలని, షేర్ మహమ్మద్ పేట నుండి రామచందని పేట వెళ్లే రోడ్ లో గల ఎర్ర కాలవపై బ్రిడ్జిని నిర్మించాలని, ఇటీవల వచ్చిన వర్షాలు, వరదలకు దెబ్బతిన్న షేర్ మహమ్మద్ పేట నుండి జగ్గయ్యపేట వెళ్లే రోడ్డును పునర్ నిర్మాణం చేపట్టాలని, గ్రామంలో మార్తి నాగేశ్వరరావు బజార్‌లో గల రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేకపోవడం వలన డ్రైనేజీ నీరు రోడ్డుపై నిలిచి పోవటంతో ఆ బజార్ ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని తక్షణమే రోడ్డు నిర్మాణాన్ని పైకి లేపి స్మశాన వాటిక గోడ ప్రక్కన డ్రైనేజీ నిర్మించి రామచంద్ర పేట రోడ్ లో గల డ్రైనేజీ కాలువలో కలపాలని, గ్రామంలో చౌకాల లింగయ్య ఇంటి వద్ద డ్రైనేజీ కాలువలు లేకపోవడం వలన డ్రైనేజీ నీరు నిలిచిపోయి తద్వారా దోమలు ప్రబలి రోగాల బారిన పడాల్సి వస్తుందని కాబట్టి తక్షణమే డ్రైనేజీ కాలువలు నర్మించాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మహాసభకు జగ్గయ్యపేట మండల పట్టణ కార్యదర్శి ఎస్ నాగమణి, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కోటా కృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు దంతాల వెంకటేశ్వర్లు, కే సుబ్బారావు, కె వెంకటేశ్వరరావు, డి నరేంద్ర, లింగయ్య పాల్గొన్నారు.

## విద్యార్థికి ఈఈ ఆర్థిక సాయం



**మచిలీపట్నం, మేజర్ న్యూస్:** మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న (తండ్రి లేని ) చిన్నారి రూపా కి చదువు కోసం రూ.5000లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మన్నెం భాస్కర్ రావు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలోయోగా గురువులు గురునాధబాబు, చింతయ్య, రేఖా,రంజిత, యోగ సాధకులు డి ఐ పి ఆర్ ఓ యమ్ వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు ఉదారత చాటుకున్నందుకు విద్యుత్ శాఖ ఈ ఈని అభినందించారు.

# అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని మెడల్స్ తెచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలి





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని మెడల్స్ తెచ్చే విధంగా విద్యార్థులకు శిక్షణ కల్పించాలని అందుకు తగు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర స్పోర్ట్స్ సిబ్బందితో అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో తమ చాంబర్లో వీఎంసి స్పోర్ట్స్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అన్ని స్పోర్ట్స్ స్టేడియంలు, జిమ్స్, స్విమ్మింగ్ పూల్స్,లో విద్యార్థులకు ప్రజలకు అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ వచ్చేలా శిక్షణ కల్పించేందుకు కావలసిన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా రు. ఏవైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే మరమతులన్నీ పూర్తి చేసే విధం గా చర్యలు తీసుకోవాలని స్పోర్ట్స్ అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ సిబ్బంది నుంచి వచ్చిన వినుపమును త్వరగా స్పందించి తురతిగతిన మరమ్మతులని పూర్తి చేసి వాళ్ళకి అప్పగించవలసిందిగా ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ టి శ్రీనివాస్, సూపరిండెండింగ్ ఇంజనీర్లు రామ్మోహన్, శ్రీరామచంద్రమూర్తి, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోగల అన్ని జిమ్ కోచ్‌లు, స్విమ్మింగ్ కోచ్‌లు, స్టేడియం ఇన్చార్జిలు పాల్గొన్నారు.



# ఎన్.సీ.సీ రిక్రూట్మెంట్



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలయందు గురువారం ఎన్.సి.సి చేరుటకు సంబంధించిన ఎంపిక ప్రక్రియను 16 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సన్సార్ సింగ్ పర్యవేక్షణలో నిర్వహించినట్లు విశ్వవిద్యాలయ ఎన్.సి.సి అధికారి లెఫ్టినెంట్ డా. డి.రామశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ ఎంపికలను విశ్వవిద్యాలయంలోని సుమారు 90 మంది హాజరు కాగా వారిలో 19 మంది బాలురు, 19 మంది బాలికలను తొలి జాబితాలో ఎంపిక చేశారు. మిగిలిన విద్యార్థులను రిజర్వ్ కోటాలో ఎంపిక గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్.సి.సి చేరు విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటుగా వారికి నేషన్ బిల్డింగ్, క్రమశిక్షణ, నేషన్ ఇంటిగ్రేషన్‌లతో పాటు 3 సంవత్సరాలు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి భావిభారత పౌరులుగా తయారు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 16 ఆంధ్ర బెటాలియన్ ఆఫీసర్ తో పాటుగా విశ్వవిద్యాలయ అధికారులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వార్డ్‌లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పరిధిలో ఉన్న వార్డ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేటట్టు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యాన చంద్ర, స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం నూతన భవనం లో గల సమావేశం హాల్లో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోగల స్పెషల్ ఆఫీసర్లు, శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 64 వార్డులకు గాను 64 స్పెషల్ ఆఫీసర్లను ఏర్పాటు చేయగా, స్పెషల్ ఆఫీసర్‌కి కేటాయించిన ప్రతి సచివాలయంలోని సమస్యల ను వాళ్ళు సమీక్షించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ఆ వా ర్డు కార్పొరేటర్ తెలియపరిచిన సమస్యలను, ఆ వార్డులో వారు గమనించిన ఉన్న ప్రతి సమస్యను, త్వరితగతిన పరిష్కరించేటట్టు చర్యలు తీసుకోవాలని, నిరంతరం వారి చర్యలను కమిషనర్ సమీక్షిస్తారని తెలిపారు. అందులో భా గంగా ప్రతి వార్డ్ స్పెషల్ ఆఫీసర్, శాఖాధిపతులు, వార్డ్ సెక్రటరీలు, జోనల్ కమిషనర్‌తో ఆ వార్డులో కమిషనర్ సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహిం చి ఆ వార్డులో ఉన్న సమస్యలన్నీ తెలుసుకొని త్వరితగతిన పరిష్కారం అయ్యే టట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలా 64 వార్డుల లోనూ 64 స్పెషలాఫీసర్లతో సమావేశం నిర్వహించే దిశగా ప్రణాళికను సిద్ధం చేయమని అధికారులను ఆదేశించారు. ప్రతి వార్డులో ఉన్న ప్రతి చిన్న సమ స్య అయినా పెద్ద సమస్య అయినా స్పెషల్ ఆఫీసర్ దృష్టిలో ఉండాలని, ఆ సమస్యను సంబంధిత శాఖాధిపతులతో మాట్లాడి త్వరగా పరిష్కరించేటట్టు చ ర్యలు తీసుకోవాలని, అందుకు కమిషనర్ సహకారం అన్నివేళలా ఉంటుందని తెలిపారు.

# వరద బాధితులకు వివక్ష లేకుండా ప్రభుత్వ ఆదుకోవాలి

## మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు





**నందిగామ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్:** వరదలలో నష్టపోయిన వారిని, వివక్ష లేకుండా ప్రభుత్వం ఆదుకోవాలి అని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహనరావు అన్నారు.ఇటీవల వరదలకు ముంపుకి గురైన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామాల, నందిగామ పట్టణంలోని 7వ వార్డు నాయకులు ప్రజాప్రతినిధులతో కలసి ఆర్డీవో రవీంద్రకు మాజీ శాసనస భ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలు వరదలు కారణంగా ముంపు గురై ఇల్లు దెబ్బతిని గృహఉపయోగ వస్తువులు నష్టపోయి బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న అధికారులు స్పందించకపోవడం శోచనీయమని అన్నారు.నియోజకవర్గంలో 4 మండలాల్లో ఆయా గ్రామాలు నివాస గృహాలు వరద ముప్పుకు గురయ్యాయని ఇళ్లలోని ఫ్రిజ్లు మిక్సీలు విద్యుత్ మోటార్ గృహ ఉపయోగకర సామాగ్రి సమస్తం దెబ్బతిన్నాయని వర ద ముంపుకు గురై రోజులు గడుస్తున్న అధికారులు ఇప్పటివరకు గ్రామాలను పరిశీలించడం కానీ నష్టాన్ని అంచనా వేయటం కానీ నష్టపరిహారం అందిం చడం కానీ జరగలేదని పేర్కొన్నారు.ప్రక్క నియోజకవర్గాలలో గ్రామాలలో నష్టం అంచనా వేసి నష్టపరిహారం కూడా అందించటం జరిగిందని మన నియోజకవర్గంలో అధికారులు నిమ్మకనీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిప డ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్డిఓ కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# నరసయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సౌమ్య, నెట్టెం రఘురాం



**నందిగామ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** కంచికచర్ల మండలం గని ఆత్కూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొమ్మినేని నరసయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, విజయవాడ పార్లమెంట్ అధ్యక్షులు నెట్టెం రఘురాం చేపట్టారు. గురువారం నాడు కంచికచర్ల మండలం గని ఆత్కూరు గ్రామంలో స్థానిక గ్రామ మండల పార్టీ నేతలతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, నరసయ్య లేని లోటు తెలుగుదేశం పార్టీకి తీర్చలేనిదని, ప్రతిపక్షంలో ఎన్నో పోరాటాలు, ప్రజా వ్యతిరేక కార్య క్రమాలను చేపడుతూ ఎప్పటికప్పుడు నాయకులకు అందుబాటులో ఉంటూ ఒక దిక్సూచిగా నరసయ్య ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి నరసయ్య మన మధ్య లేకపోవడం నిజంగా బాధాకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం దిశగా పనిచేస్తుందని సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి నాయకులు గ్రామాల్లో పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారన్నా రు. ఇటీవల అధిక వర్షాలు వరదల వల్ల అతలాకుతలమైన గ్రామాలను తిరిగి మళ్లీ గాడిలో పెట్టే విధంగా అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులను మం జూరు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సహాయక చర్యలు నష్టపరి హారాలు పెద్ద ఎత్తున అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కింద న్నారు. ఇచ్చిన హామీల అమలులో భాగంగా మరెన్నో కార్యక్రమాలను చేసు కుంటూ కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో మండల అధ్యక్షులు కోగంటి బాబు, వివిధ గ్రామాల నాయకులు, మండల పార్టీ నేతలు కూటమి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు దేవాలయంలో ప్రత్యేక పూజలలో మండలి బుద్ధప్రసాద్



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి భక్తులకు అత్యంత ప్రియమైన లడ్డూ ప్రసాదం తయారీ ప్రక్రియలో గత వైసీపీ ప్రభుత్వంలో కల్తీ నెయ్యి వినియోగం ఘటనకు నిరసనగా గురువారం ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు దేవాలయంలో పూజ, సంప్రోక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్ర సాద్ విచ్చేసి శ్రీకాకుళేశ్వర స్వామి వారికి పూజ, సంప్రోక్షణ జరిపించారు. ఈ సందర్భంగా ఆయనను దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వర ప్రసాదరావు, దేవస్థాన ప్రధాన అర్చకులు ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు దేవాలయం నుంచి పంచా యతీ కార్యాలయం వరకు తెలుగు యువత రాష్ట్ర నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), జనసైనికుల ఆధ్వర్యంలో పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, అయినంపూడి భానుప్రకాష్, అచ్చంపాలెం సర్పంచ్ గాజుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు సిద్దినేని కుమార్ రాజా, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పరిసే చలపతి, టీడీపీ గ్రామ అధ్యక్షులు దాశం రామకృష్ణ, కూటమి నాయకులు కొండవీటి కృష్ణమూర్తి, తాడికొండ సాయితేజ పాల్గొన్నారు.



# పారిశుధ్య కార్మికుడు దేవయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**జగ్గయ్యపేట సెప్టెంబర్ 26 మేజర్ న్యూస్ :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామపంచాయతీ కార్మి కుడు కురుమర్తి దేవయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదు కోవాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం సోమేశ్వ రరావు డిమాండ్ చేశారు. మండలంలోని షేర్ మహ్మద్ పేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన పారిశుధ్య కార్మి కుడు కురుమార్తి దేవయ్య కుటుంబాన్ని ప్రజాసంఘాల నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను దేవయ్య కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితుల్ని, మృతి చెందిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమేశ్వరరావు మా ట్లాడుతూ ఎన్నో ఏళ్లగా గ్రామపంచాయతీలో పరిశుద్ధ కార్మికులుగా విదులు నిర్వహిస్తూ ఆకాలంగా మృతి చెం దాడని, ఆ కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని కాబట్టి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, జె వెంకటరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వరద బాధితుల సహాయార్థం రూ.2లక్షల విరాళం



**గన్నవరం, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి సహాయ నిధికి గన్నవరం స్రవంతి హై స్కూల్ ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ, ఉపాధ్యాయులు గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కి రెండు లక్షల రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఈలాంటి సహాయ సహకారాలు అందించాలని వారందరూ,అందరు బాగా చదువుకుని మన దేశ అభివృ ద్ధిలో పాత్ర పోషించాలని కోరుకున్నారు. ప్రోత్సహించిన తల్లిదండ్రులను స్కూలు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ రామకృష్ణ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# బొడ్డపాడులో పరిశుభ్రత కార్యక్రమాలు



**పామర్రు సెప్టెంబర్ 26 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ పరిధిలోని తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామంలో స్వచ్ఛత హి 2024 పక్షోత్స వాల్లో భాగంగా గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలను చేశారు చేపట్టారు ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి, స్థానిక సర్పంచ్ మూడే శివశం కరరావు పాల్గొని గ్రామంలో పారిశుధ్య నిర్వహణ చేపట్టడంతో పాటు మొక్క లు నాటే కార్యక్రమం కూడా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద గ్రామపంచాయతీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని పరిశుభ్రం చేశారు.

# స్వర కేఎంఆర్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం



**నందిగామ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్:** పట్టణంలో స్వర కెఎంఆర్ యూనివర్సల్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. స్వర కెఎంఆర్ యూనివర్సల్ ఆస్పత్రి విభాగం ఆధ్వర్యంలో నూతనంగా మోకాళ్ళ మార్పిడి, హృదయ వ్యాధుల ఉచిత అవగాహన వైద్య శిబిరాన్ని గురువారం నాడు ప్రారంభించి, అక్కడ అందించే వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు. ఉచిత అవగాహన వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వర కెఎంఆర్ యూనివర్సల్ హాస్పిటల్ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేంద్ర, స్థానిక పట్టణ పార్టీ నేతలు కూటమి నాయకులు పాల్గొన్నారు.





## కొనకళ్ళకు కూటమి నాయకులు శుభాకాంక్షలు

**కృత్తివెన్ను సెప్టెంబర్ 26 మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ రావు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా కృత్తివెన్ను మండల కూటమి నాయకులు గురువారం వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి విధేయులైన వారిని అత్యున్నత పదవులు వరిస్తాయి న్నారు. పార్టీ కోసం పార్టీ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తూ పార్టీని విజయ తీరం వైపు నడిపించిన కొనకళ్ల నారాయణరావు కు ఆర్టీసీ చైర్మెన్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రతిఫలం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఒడుగు తులసి రావు, మాజీ ఎంపీపీ వలవల సత్యనారాయణ, మాజీ డిసి నెక్కంటి భాస్కర రావు, కూనసాని చిన్నా, పాశం మల్లేశ్వరరావు,ర్యాలి సత్యనారాయణ, ప్రత్తిపాటి రామాంజనేయులు, రావూరి తాతాజీ, యాదం రెడ్డి కొండా,చెన్న కేశవరావు, వలవల తాతాజీ, చంద్ర మౌళి, పిన్నెంటి రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మోపిదేవి దేవస్థానంలో స్వచ్ఛత - హి - సేవ



**కోడూరు, మేజర్ న్యూస్ :** మోపిదేవి మండలం, మోపిదేవి గ్రామంలో వేంచేస్తున్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు స్వచ్ఛత – హి – సేవ కార్యక్రమంలో భాగంగా ది. 17-9-2024 నుండి 2-10-2024 వరకు దేవాలయంలో నిర్వహించబడుచున్నవి అందులో భాగంగా గురువారం శ్రీ స్వామి వారి కళ్యాణ మండపంలో పొంగలి శాల, అక్షరాభ్యాసం జరుగు ప్రదేశాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమం అంతయు చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆదేశాలను అనుసరించి ఆలయ సూపర్డెంట్ బొప్పన సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి సాయం



**చల్లపల్లి, సెప్టెంబరు 26, మేజర్ న్యూస్ :** రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ సమస్యలతో చికిత్స పొందుతున్న చల్లపల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ సుభానక్కు చల్లపల్లి దస్తావేజు లేఖరులు, వీఆర్వోలు సాయమందించారు. జనసేన మహిళా నేత తోట కనకదుర్గ ద్వారా విషయం తెలుసుకున్న డాక్యుమెంటరీ రైటర్లు, వీఆర్వోలు కలిసి తమవంతుగా రూ.16వేల 700లను గురువారం సుభాన్కు అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంటరీ రైటర్లు కస్తూరి వరప్రసాద్, వడ్లమూడి రాజశేఖర్, దావులూరి మధుసూధనరావు, తోట నాగేశ్వరరావు, తోట రాజశేఖర్, ఆకుల లక్ష్మీనారాయణ, బత్తుల సాయి, సుబ్రహ్మణ్యం, తాళ్లూరి హరి, గుడిపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సయ్యద్ సాలార్‌కి ఘన సన్మానం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బందరు మండలం, చిట్టి పాలెం ఉన్నత పాఠశాలలో పనిచేయుచున్న సయ్యద్ సాలార్, హిందీ మాస్టారును జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు పొందిన సందర్భంగా, టెన్త్ క్లాస్ 2024 బ్యాచ్‌లో తన హిందీ సబ్జెక్టుల 100% ఉత్తీర్ణత సాధించిలోకు పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర టీచర్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షులు మిర్జా రియాజ్ హుస్సైన్, అలీ అబ్బాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనిత,పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బారావు, అశోక్, శోభారాణి, బీనా దేవి, వరలక్ష్మి అమీనా, బాల త్రిపుర, సుశీల, మెహర్ జ్యోతి, పాల్గొని సన్మానించారు.

# లడ్డు కల్తీ పేరుతో రాష్ట్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ బలపడాలని చూస్తున్నాయి




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు తయారీలో అక్రమాలు, అన్యాయం జరిగిందనే సాకుతో రాష్ట్రంలో బిజెపి, ఆర్ ఎస్ ఎస్ లు మత విద్వేషాలు రెచ్చగొట్టి రాష్ట్రంలో బలపడలని చూస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక జి. కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవుడు అందరివాడని ప్రజలు వారికి ఇష్టమైన దేవుడిని పూజించుకుంటారని ఏ దేవున్ని పూజించాలో రాజకీయ పార్టీలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.మతం అనేది వారి వ్యక్తిగత విశ్వాసం అన్నారు. గత వారం పది రోజులుగా తిరుపతి లడ్డు తయారీలో అక్రమాలు, అన్యాయం జరిగిందని అధికార ప్రతిపక్ష పార్టీలు తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం దేవుణ్ణి రాజకీయాలలోకి లాగుతున్నరన్నారు.ఇది మంచి పద్ధతి కాదన్నారు. దేవుడు పేరుతో మతాలు, కులాలు రెచ్చగొట్టడానికి బిజెపి ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికే లడ్డు కల్తీపై ప్రభుత్వం సిట్ దర్యాప్తుకు ఆదేశించిందని కాబట్టి సిట్ నివేదిక వచ్చేదాకా రాజకీయ పార్టీ నాయకులందరూ మౌనంగా ఉంటే మంచిదని సూచించారు. అలాగే తప్పు చేసినవారు ఏ పార్టీ వారు అయిన, ఏ కులం వారు అయిన తప్పని సరిగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే సిట్ దర్యాప్తు నిస్పాక్ష పాతంగా జరిగేందుకు అధికార ప్రతి పక్ష పార్టీలు సహకరించాలన్నారు. లౌకిక పార్టీగా చెప్పుకునే తెలుగుదేశం పార్టీ మత విద్వేషాలకు పోకుండా ఉంటే మంచిదన్నారు. మరోవైపు లడ్డు కల్తీ పేరుతో ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలికొదిలేసిందన్నారు. ప్రజలేమో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కోసం ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు.అలాగే పేరుకే ఉచిత ఇసుక అని ప్రభుత్వాలు మారిన కార్మికులకు, ప్రజలకు ఇసుక అందుబాటులోకి రాలేదన్నారు.గత ప్రభుత్వం మాదిరిగానే ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలి పోతుందని,ఇక్కడ సరఫరా చేసే ఇసుక ధరలు కూడా గత ప్రభుత్వం హయాంలో కంటే ఎక్కువగా ఉన్నాయన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక అందించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 4 తేదీన సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన లకు పిలుపు నిచ్చిందన్నారు.ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు,కృష్ణా జిల్లా కార్యదర్శి. వై.నరసింహారావు,నగర కార్యదర్శి బూర.సుబ్రమణ్యం లు పాల్గొన్నారు.

## చోరీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**నందిగామ సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** పోలీస్ కమిషనర్ రాజ శేఖర్ బాబు ఆదేశాలతో రూరల్ డిసిపి మహేశ్వర రాజు నిర్దేశికత్వంలో నందిగామ స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న చోరీ గ్యాంగ్ ను నందిగామ పోలీసులు సర్కిల్ ఇన్స్పెక్టర్ నాయుడు ఆధ్వర్యంలో అది చాకచక్యంగా వలపన్ని పట్టుకున్నారు. గురువారం నందిగామ పోలీస్ స్టేషన్లో గత కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకొని వారి వద్ద నుండి 12 టైర్ల లారీ ఒక మోటార్ సైకిల్ నగదును స్వాధీనం చేసుకుని ముద్దాయిలను జ్యూడిషియల్ రిమాండ్కు తరలించారు. ఈ సందర్భంగా దొంగతనాలు పాల్పడుతున్న చోరీ గ్యాంగ్ ను పట్టుకున్న తమ సిబ్బందిని ఏసీబీ రవి కిరణ్ అభినందించారు.

# దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగొద్దు, ఇసుక రేట్లు పెరిగాయి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రెండు రోజులు శిక్షణా తరగతులకు ప్రజల గాను ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మచిలీపట్నంలో పాల్గొన్నారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇప్పుడు రాజకీయ పార్టీలన్నీ రాజకీయాలు చేస్తున్నాయని దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగొద్దు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పుడు సిట్‌నే ఏర్పాటు చేసిందని ఆ నివేదిక వచ్చేదాకా అందరు సమన్వయనం పాటించాలని సూచించారు. ఇప్పుడు వచ్చిన గవర్నమెంట్ ఇసుక ఉచితమని చెప్పిన గత ప్రభుత్వం రేటు పెట్టిన ప్రజలకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. దీంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పాలవుతున్నారు. ఇసుక లభ్యం కావడం లేదు ప్రజలకు కావలసిన మౌలిక సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు.



## వందరోజుల సంక్షేమం, అభివృద్ధి ఇది మంచి ప్రభుత్వం

**నందిగామ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని,నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య నందిగామ పట్టణం 13వ వార్డులో ఏపూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి 100 రోజుల్లో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిందని, గత 5 ఏళ్లలో కనిపించని మార్పు ఈ వంద రోజుల్లో కనిపిస్తోందన్నారూ.గతంలో ఉన్న 3 వేల పింఛనును వృద్ధులకు 4 వేలు, దివ్యాంగులకు 6 వేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు. ప్రతి నెల 1వ తేదీనే పింఛను అందిస్తూ వారిని ఆదుకుంటున్నారని నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, 13వ వార్డు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేర్ని నాని పవన్‌కి క్షమాపణ చెప్పాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై పేర్ని నాని చేసిన క్షమాపణ చెప్పాలని మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామ కృష్ణ డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా వైఎస్ఆర్‌పీ అధ్యక్షులు, మాజీమంత్రి పేర్ని నానికి ఇంటి ఎదుట వందల మంది జనసైనికులు ఆందోళన చేపట్టారు. పేర్ని నాని డౌన్ డౌన్ అంటూ నినాదాలు నిన్న విలేకరుల సమావేశంలో పవన్ కళ్యాణ్ పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలంటూ జనసైనికులు రోడ్డుపై బైఠాయించారు. ఆందోళన సమయంలో ఇంట్లోనే పేర్ని నాని, పేర్ని కిట్టు ఉన్నారు. జనసైనికుల ఆందోళనలో పేర్ని నాని దిష్టిబొమ్మను జనసేన నాయకులు బండి రామకృష్ణ, మాదివాడ రాము, కొట్టె వెంకట్రావు, జనసైనికులు దగ్ధం చేశారు. భారీగా మోహరించిన పోలీసులు పోలీసుల రాకతో ఆందోళన సద్దుమనిగింది.





# చారిత్రాత్మక ప్రదేశాలలో స్వచ్ఛత హి సేవ






(మొదటిపేజీ తరువాయి)

విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా చారిత్రాత్మక ప్రదేశమైన గాంధీ కొండాలో శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జరిగే స్వచ్ఛత కార్యక్రమంలో గురువారం ఉదయం విజయవాడ నగరపాలక సంస్థ వారు గాంధీకొండా, మొగల్రాజ్ పురం లో ఉన్న గుహలలో ఉన్న వ్యర్థాలను శ్రమదానం ద్వారా పరిశుభ్రపరిచారని, ప్రతిరోజు విజయవాడ నగరపాలక సంస్థ వినూత్నంగా స్వచ్ఛతలో కార్యక్రమాలు చేపడుతోందని, అందులో ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారని, స్వచ్ఛ విజయవాడ కేవలం ప్రజల భాగ్యస్వామ్యంతోనే సాధ్యమని, అందుకు ప్రజల సహకారం అందుతున్నందుకు చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. 300 అడుగుల పొడవైన జాతీయ జెండాను పట్టుకొని గాంధీ కొండా కింద నుండి పైకి ర్యాలీ ద్వారా అక్కడున్న ప్రజలకు ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్ పై 200 విద్యార్థినీ విద్యార్థులు,సర్కిల్ 1,2 నుండి 200, మొత్తం 400 మంది ఉత్సాహంగా పాల్గొని సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రత, రెడ్యూస్డ్ రీ యూస్ రీసైకిల్, స్వచ్ఛభారత్, నినాదాలతో అక్కడున్న ప్రజలకు అవగాహన కల్పించారు ప్రజల భాగస్వాముతో స్వచ్ఛత హి సేవలో భాగంగా గాంధీ కొండను మొగల్రాజపురం గుహలను పరిశుభ్రత చేస్తున్న వేళ గాంధీ కొండలో పరిశుభ్రం చేయడానికి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు వారికీ పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడానికి బుర్రకథ చెప్పే బృందంతో వారికి అర్థమయ్యే రీతిలో స్వచ్ఛతను వివరించారు. తదుపరి విద్యార్థినీ విద్యార్థులు సర్కిల్ వన్ కార్యాలయం సిబ్బంది కమిషనర్ ధ్యానచంద్ర అందరూ గాంధీ కొండలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర వ్యర్థాలను, గడ్డిని కలుప మొక్కల్ని, స్వయంగా స్వచ్ఛత హి సేవ అంటూ పరిశుభ్రపరిచారు. ఇందులో భాగంగా మొగల్రాజపురం గుహలోను సర్కిల్ 3 కార్యాలయంలో ఉన్న కార్పొరేషన్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని అక్కడున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు కలుప మొక్కలు, గడ్డిని మొత్తం పరిశుభ్రపరచారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర పలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తో పాటు అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కే.వి.సత్యవతి,చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, సర్కిల్ వన్ కార్పొరేషన్ సిబ్బంది, గాంధీజీ మున్సిపల్ హై స్కూల్, పాదుర్తి సుందరమ్మ హై స్కూల్, మహమ్మద్ అలీ పురం వించ్పేట్ ఉర్దూ హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.







# కేజీబీవీల్లో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దు

## కలెక్టర్ల ఆధ్వర్యంలో పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ

## సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

విజయవాడ, మేజర్ న్యూస్ : పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 507 బోధన సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన, 97 బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన ఒక సంవత్సర కాలానికి గానూ నియామకం కోసం పత్రికా ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎర చూపి దళారులు పైరవీలు చేస్తునట్లు వార్తలు వస్తున్నాయి. లక్ష నుండి 5 లక్షలు చెల్లిస్తే (అడ్వాన్స్ గా 20,000/- నుండి 80,000/-) పోస్ట్ గ్యారెంటీ అని చెబుతున్నట్లుగా మా కార్యాలయం దృష్టికి వచ్చింది. ఇందు నిమిత్తం అభ్యర్థులకు తెలియచేయడం ఏమనగా నియామకం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ నియామక ప్రక్రియ పూర్తిగా ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో మెరిట్ ఆధారంగా చేపట్టడం జరుగుతుంది. ఏ పోస్టుకు కూడా మౌఖిక పరీక్షలు కాని, స్కిల్ పరీక్షలుగాని నిర్వహించబడవు. కావున ఎవరైనా దళారులు ఇంటర్వ్యూలో మార్కులు వేయిస్తామని గాని, ఉద్యోగాలు ఇప్పిస్తామని గాని ప్రలోభ పెట్టిన యెడల మీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోగానీ, రాష్ట్ర సంచాలకుల కార్యాలయం లో గాని ఫిర్యాదు చేయవలసిందిగా కోరడమైనది. అభ్యర్థుల ఎంపిక పూర్తిగా విద్యార్హతలలో వారు సాధించిన మెరిట్ పైన మాత్రమే ఆధారపడి జరుగుతుంది. ప్రలోభాలకు గురిచేస్తున్న దళారులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగ నియామకాల గురించి ఎవరైనా దళారులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# అక్టోబర్ 4న విజయవాడ ధాండియా మహోత్సవ్

## బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ లో కర్టెన్ రైజర్, సీడీ లాంచ్







**విజయవాడ, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** దసరా ఉత్సవాల సందర్భంగా ది విజయవాడ ధాండియా మహోత్సవ్ కార్యక్రమాన్ని ప్రముఖ ఇంటర్నేషనల్ స్కూల్ బ్లూమింగ్ డేల్, జిజ్ఞాస సంస్థ'ల ఆధ్వర్యంలో అక్టోబర్ 4న ఘనంగా నిర్వహించబోతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న అనేక సంఘాల ప్రతినిధులతో "కర్టెన్ రైజర్, సిడి లాంచ్" కార్యక్రమాన్ని పెనమలూరులోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త 'పోలవరపు కోటేశ్వరరావు సాహితి సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించారు. ఆ క్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం, విజయవాడ నగరంలో రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి భాషా బేధం లేకుండా వచ్చిన ప్రజలందరు కూడా తమ సంస్కృతిని తమ సంప్రాదాయాలను తమ కళా రూపాలను తమ ఆహారపు అలవాట్లను కొనసాగించుతూ ప్రతి ఏటా దసరా మహోత్స వాలను తమ సంఘం వరకే నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. నూతనంగా బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్, జిజ్ఞాస సంస్థలు సంయుక్తంగా విజయవాడలోని అన్ని ప్రాంతాల వారు, అన్ని సంఘాల వారు, చిన్నవారి నుండి వృద్ధుల వరకు, అన్ని వర్గాలు, అన్ని స్థాయిల ప్రజలందరూ కూడా తారతమ్యం లేకుండా కలిసికట్టుగా పాల్గొనే ఒక బృహత్తర సాంస్కృతిక వేదికను ది విజయవాడ ధాండియా మహోత్సవ్ పేరిట కల్పించడం జరుగుతుంది. ఈ సంవత్సరం ది విజయవాడ ధాండియా మహోత్సవం అట్టహాసంగా అంగరంగ వైభవంగా వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటల పోటీలతో వివిధ సాంప్రదాయ వంటలు, సాంప్రదాయ వస్త్రధారణతో అక్టోబర్ 4న పెనమలూరు బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు.

బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సి పల్ హరిప్రాన్ కౌర్ మాట్లాడుతూ ఈ మహోత్సవంలో భాగంగా ఫ్యాషన్ షో, దాండియా, గర్భ నృత్య పోటీలు, ప్రదర్శనలు, సంప్రదాయ వస్త్రధారణ పోటీలు, ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని, షింది, గుజరాతి, పంజ -బి, మార్వాడి, జైన్, రాజ్పుట్, మళయాళి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తదితర 50కిపైగా సాంస్కృతిక సాంఘిక సంస్థల భాగస్వామ్యంతో సంయుక్తంగా ఘనంగా నిర్వహించబోతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో జెడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ వారి ఫ్యాషన్ షో, దాండియా, గర్భ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమానికి ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త చందన బ్రదర్స్ అధినేత చాందిని చందన, జిజ్ఞాస సంస్థ సిఈవో గాయత్రి వరిగొండ, హన్స్ రాజ పటేల్, వేణు కుమార్, వివిధ రాష్ట్రాల 60 సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తమ క్రీడాకారులుగా 33 మంది విద్యార్థులు



**గన్నవరం, సెప్టెంబర్ 26, మేజర్ న్యూస్ :** 68 వ పాఠశాల క్రీడా సమాఖ్య కృష్ణా జిల్లా, గన్నవరం మండలం నుండి ఉత్తమ క్రీడాకారులుగా 33 మంది విద్యార్థులు గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల నుండి ఎంపికై నియోజక వర్గ స్థాయి పోటీలకు అలాగే జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి కి ఇద్దరు అర్హత సాధించినట్లు పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయురాలు పి. ఉమాదేవి బుధవారం పత్రికలకు తెలిపారు. ఈ నెల 23,24 తేదీలో గన్నవరం లో పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలు జరిగినట్లు ఆమె తెలిపారు. కాగా ఫుట్ బాల్ విభాగం రాష్ట్ర స్థాయి పోటీలకు పి. మాల్లిఖార్జునరావు (అండర్ -17)డి. విజయ్ (అండర్ -14) ఎంపికైనాడు. అలాగే కబడ్డీ క్రీడలో బి. హరి చరణ్ యమ్. కిరణ్ కుమార్(అండర్ -17),పి. హర్ష వర్ధన్, కే చంద్ర శేఖర్, జి. ఠాగూర్, బి. మణికంఠ (అండర్ -14)వాలీబాల్ క్రీడలో జి. నాగ బాలాజీ, ఆర్. తేజేష్, కే. వాసు, టి. అమర్ (అండర్ -17),యమ్. మహేష్, పి. రాజ్ కుమార్, కే. వెంకట సాయి (అండర్ -14),ఖోఖో క్రీడలో జి. బాలాజీ, ఆర్. తేజేష్, కే. వాసు, యమ్ అఖిల్, పి. అమర్, డి. నాని, పి. భాను ప్రకాష్,(అండర్ -17) యు. పండు బాబు, జి. తేజ, పి జెశ్వంత్, పి. కౌషిక్, టి. వెంకటేష్, యస్. కే రోషన్ ఆర్. అభిరామ్ (అండర్ -14)షటిల్ బాడ్మింటన్ క్రీడలో టి. జశ్వంత్, యమ్. భువనేశ్వర్ (అండర్ -17)కే. నిఖిల్ (అండర్ -14)చెస్ క్రీడ లో పి. మల్లిఖార్జునరావు (అండర్ -17)డి. వరుణ్ బాబు లు (అండర్ -14) మండలం నుండి నియోజకవర్గ పోటీలకు అర్హత సాధించారని ఉమా దేవి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్‌లను ఉమా దేవితో పాటు ఉపాధ్యాయ, ఉపాధ్యేతర సిబ్బంది అభినందించారు.

# పవన్ కళ్యాణ్ దీక్షకు మద్దతుగా ఆలయాల శుద్ధి



**కృత్తివెన్ను సెప్టెంబర్ 26 మేజర్ న్యూస్ :** సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడు పై ఉందని కృత్తివెన్ను మండల కూటమి నాయకులు అన్నారు. తిరుమల తిరుపతి లడ్డు అపవిత్రం కావటంపై జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మండల తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల నాయకులు లక్ష్మీపురం వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం శుద్ధి చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బందరు పార్లమెంటు సభ్యులు బాలశౌరి, పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని వేడుకొన్నారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య మాట్లాడుతూ వైకాపా గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని పలు ప్రముఖ దేవాలయాల ప్రతిష్ట మసకబారిపోయిందని హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వైకాపా పాలన కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉప సర్పంచ్ గంగాజలం, లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొప్పర్తి భాస్కరరావు, ఎలుగుబంటి కృష్ణ, ఇంటి కిరణ్,అందే సత్తిబాబు, విజయలక్ష్మి స్టూడియో సత్యనారాయణ, నక్క రాంబాబు, కొప్పర్తి రంగారావు, చిలంకుర్తి శివకృష్ణ, వాసుదేవ కృష్ణ, తిరుమాని రామాంజనేయులు, సీతాల రామకృష్ణ, కొప్పర్తి బాబి, చౌధుల కృష్ణ, కొప్పర్తి శివ, పాలపర్తి తాతాజీ, లింగం స్వామి, పాశం శ్రీను, కొక్కిలిగడ్డ ఏసు రాజు, కొణతం సుబ్రహ్మణ్యం, చందు సురేష్, లింగం రుషి, ఆలపాటి కన్నబాబు, నక్క సుబ్బారావు, కొప్పర్తి రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## హర్ ఘర్ తిరంగాలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు

**విజయవాడ మేజర్ న్యూస్ :** సెంట్రల్ గవర్నమెంట్ ఆగస్టు 15వ తారీఖున స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రారంభించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని మహా న్యూస్ ఛానల్ అధినేత వంశీకృష్ణ మహా వందనం అని కార్యక్రమాన్ని దేశభక్తిని పెంపొందించే విధంగా ప్రారంభించారు. దీనిలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు వన్ మినిట్ వీడియోని దేశభక్తిని పెంపొందించే విధంగా ఒక వీడియో చేసి పంపించే కార్యక్రమం ప్రారంభించి వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. దీనిలో భాగంగా బాలాజీ నగర్ మహిత స్కూల్ విద్యార్థిని చిరంజీవి ఆకాంక్ష (యూకేజీ ), అంజుమా (సిద్ధార్థ మహిళా కళాశాల) 5000 రూపాయల కన్సలేషన్ బహుమతిని సొంతం చేసుకున్నారు. వీరితో పాటు పలు విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు షారోజ్, రామ్ మణికంఠ, నితీష, జశ్రీ కూడా బహుమతులు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదగా అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గద్దె రామ్మోహన్ విద్యార్థులను ఉద్దేశించి దేశభక్తిని పెంపొందించే విధంగా విద్యార్థులకు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రత్నం రమేష్, శివరామకృష్ణ, స్కూల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ దేవినేని వరలక్ష్మి, అకాడమిక్ డీన్ సురేష్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ గంగ, ఇన్చార్జెస్ ఉషారాణి, బభిత, భార్గవి, నరసింహం, సంతోష్, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో మొదలైన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు



**పామర్రు సెప్టెంబర్ 26 మేజర్ న్యూస్ :** పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా చొరవతో లంక గ్రామాల్లో విద్యుత్ స్తంభాల పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని తోటవల్లూరు మండలం చాగంటిపాడు గ్రామానికి చెందిన లంకలో ఇటీవల సంభవించిన కృష్ణా నది వరద కారణంగా ఎస్సీ సొసైటీ పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపోయి కొట్టుకుపోయాయి. ఈ విషయాన్ని స్థానిక ఎస్సీ సొసైటీ సభ్యులు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి తోట్లవల్లూరు సబ్ స్టేషన్ ఏ ఈ కి సమాచారం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఏఈ వెంటనే విద్యుత్ స్తంభాల పునర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. గురువారం ఈ పనులను తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎస్సీ సొసైటీ సభ్యులు నిమ్మకూరి కోటేశ్వరరావు, నందేటి డేవిడ్, నిమ్మకూరి భాస్కర్, నందేటి ఎలియేజర్ తదితరులు పరిశీలించారు.

విలేకరులు కావలెను
సూర్య దినపత్రిక నందు
కంచికచర్ల, చందర్లపాడు,
ఇబ్రహీంపట్నం, వీరులపాడు మండలాల్లో
పని చేయుటకు విలేకరులు కావలెను.
ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999